విద్యుత్ చార్జీల పెంపుపై హోరెత్తిన పోరుబాట



పోరుబాట నిరసన ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ, మాజీ ఎమ్మెల్యే కోన

హోరెత్తిన.. విద్యుత్ పోరు బాట

- విద్యుత్ చార్జీల పెంపుతో బాదుడే...బాదుడు
- తగిన బుద్ధి చెబుతామంటున్న ప్రజలు
- ఆరు నెలల పాలనతోనే అప్పులపాలు చేసిన కూటమి సర్కారు
- పోరు బాటలో మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి

బాపట్ల: విద్యుత్ చార్జీల పెంపుదలను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ చేపట్టిన నిరసన ప్రదర్శన హోరెత్తింది. విద్యుత్ చార్జీలు పెంపు పేదోడిపై పెనుభారం మోపిందంటూ ప్లేకార్డులు ప్రదర్శనలతో 'పోరు బాట' సాగింది. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున, మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయం నుంచి భారీ ప్రదర్శన విద్యుత్ ఎస్ఈ కార్యాలయం వరకు సాగింది. ఈ ప్రదర్శనలో పార్టీ నాయకులతో పాటు ప్రజలు కూడా భారీగా పాల్గొన్నారు. విద్యుత్ కార్యాలయం వద్ద మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి నాయకత్వంలో కూర్చొని నిరసన తెలియజేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేద వాడికి సంక్షేమ ఫలాలు అందాలనే లక్ష్యంతో అన్ని వర్గాల ప్రజలను ఆదుకున్నారని కోన రఘుపతి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమం లేకపోగా మరోవైపు ధరల భారం మోపి ప్రజల నడ్డి విరుస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రం, కేంద్రంలో కూటమి ప్రభుత్వం ఉన్నప్పటికి నిధులు తీసుకురావటంలో ఘోరంగా విఫలం చెందన్నారని దుయ్యబట్టారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే రాష్ట్ర వ్యాప్తంగా పెన్షన్లు తగ్గింపు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం తన తీరు మార్చుకోకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని కోన హెచ్చరించారు. ఈ నిరసన ర్యాలీలో వైఎస్సార్ సీపీ నాయకులు కోకి రాఘవరెడ్డి, కాగిత సుధీర్‌బాబు, ఉయ్యూరు లీలా శ్రీనివాసరెడ్డి, వడ్డిముక్కల డేవిడ్, దొంతిబోయిన సీతారామిరెడ్డి, ఏడుకొండలరెడ్డి, కొక్కిలిగడ్డ చెంచయ్య, చింతల రాజశేఖర్, అశ్వనీరెడ్డి, గొర్రుముచ్చు పుష్ప రాజ్యం, వేల్పుల మీరాభి, చల్లా రామయ్య, మండే విజయ్‌కుమార్, షేక్.సయ్యద్ పీర్, జోగి రాజా, శాయిల మురళి, చిన్నపోతుల హరిబాబు, గంగిశెట్టి రత్తయ్య, మోర్ల సముద్రాల గౌడ్, శాయిల మురళి తదితరులు పాల్గొన్నారు.

రూ.15 వేల కోట్ల భారం



కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలలకే ప్రజలపై పన్నుల పోటు వేసింది. విద్యుత్ చార్జీలు పెంపుదలతో రాష్ట్ర ప్రజలపై రూ.15 వేల కోట్లు భారం మోపింది. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు విద్యుత్ ఉచితంగా ఇచ్చే పథకాన్ని కూడా అటకెక్కించేందుకు చూస్తోంది. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను నమ్మించారు. అధికారం చేపట్టిన తర్వాత అమలు చేయడం సాధ్యం కాదని చెతులెత్తేయడం విడ్డూరంగా ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడేనాటికి అప్పటి చంద్రబాబు నాయుడి ప్రభుత్వం రూ.100 కోట్ల నిల్వ ఖజానాలో ఉంచింది. వైఎస్సార్ సీపీ దిగిపోయే సరికి రూ.7వేల కోట్లు మిగులు ఉంచింది. సంక్షేమ పథకాలు అమలు చేసి, మరో శ్రీలంకలా రాష్ట్రాన్ని మార్చేందుకు సిద్ధంగా ఉన్నారని ఎద్దేవా చేసిన చంద్రబాబు.. నేడు ఆరు నెలలకే రూ.65వేల కోట్లు అప్పులు ఏ విధంగా చేశారో లెక్కలు చెప్పాలి.

– కోన రఘుపతి, మాజీ ఎమ్మెల్యే, బాపట్ల



విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసనలో వైఎస్సార్ సీపీ రేపల్లె సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్

వంచనతో గద్దెనెక్కి.. ప్రజలను నట్టేట ముంచారు

- నయ వంచన చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య
- ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచిత పథకానికి మంగళం
- విద్యుత్ చార్జీల పెంపును విరమించుకోవాలి
- పోరుబాటలో వైఎస్సార్ సీపీ రేపల్లె సమన్వయకర్త డాక్టర్ గణేష్


విద్యుత్ డీఈ సురేష్ బాబుకు వినతిపత్రం అందజేస్తున్న సమన్వయకర్త డాక్టర్ ఈవూరి

రేపల్లె రూరల్: కల్లబొల్లి మాటలతో నయ వంచన చేసి గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేశారనటంలో ఎటువంటి సందేహం లేదని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయర్త డాక్టర్ ఈవూరు గణేష్ పేర్కొన్నారు. పెరిగిన విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా పట్టణంలోని ఇసుకపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురు శుక్రవారం నిర్వహించిన పోరుబాట నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. స్థానిక సబ్ స్టేషన్ ఆవరణంలో బైఠాయించి విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, సంపద సృష్టి అంటే చార్జీల పెంపు కాదని, ఎస్సీ, ఎస్టీల ఉచిత విద్యుత్ పథకాన్ని పునరుద్ధరించాలని నినాదాలు చేశారు. అనంతరం విద్యుత్ శాఖ డీఈ సురేష్ బాబు, ఏఈ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, పార్టీ నాయకులు కరేటి శేషగిరిరావు, మేడికొండ అనిల్, చిమటా బాలాజీ, చిత్రాల ఓబేదు, బొర్రా శ్రీనివాసరావు, కాటూరి శివనాగబాబు, బగ్గారెడ్డి, రవిరెడ్డి, రాజశేఖర్, కాశీప్రభాకర్, నాగేశ్వరరావు, అరుణ్‌కుమార్, ఇంకొల్లు రామకృష్ణ, కొండలురెడ్డి, వీసం నాగలక్ష్మి, నీలా నాంచారయ్య, పట్టెం శ్రీనివాసరావు, షేక్ లియాకత్‌భాషా, అబ్దుల్ ఖుద్దూష్, చదలవాడ శ్రీనివాసరావు, ప్రవీణ్‌కుమార్, వై.రాంబాబు, కరుణానిధి, ప్రభుకుమార్ పాల్గొన్నారు.

పేదల సొమ్ము కార్పొరేట్‌కు దోచిపెట్టే కుట్ర



పేదల సొమ్మును కార్పొరేట్ సంస్థలకు స్మార్ట్ మీటర్ల పేరుతో దోచి పెట్టే కుట్రలకు సీఎం చంద్రబాబు నాయుడు పాల్పడుతున్నారు. 'నేను మారాను, నన్ను నమ్మండి, వచ్చే ఐదేళ్లల్లో విద్యుత్ చార్జీలను పెంచను, ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ భారాలను మోపను.' ప్రజలను నమ్మబలికారు. నేడు పేద, మధ్య తరగతి ప్రజలపై విపరీత భారాలను మోపుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బలహీన వర్గాలు ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్‌ను వినియోగించుకనే అవకాశం కల్పించింది. కూటమి ప్రభుత్వం ఆరు నెలలు నిండక మునుపే ఆ పథకానికి మంగళం పలికి, భారాలను మోపటం సిగ్గుచేటు. సర్దుబాటు, సర్ చార్జీల పేరుతో ప్రజలపై మోపుతున్న రూ.15,485.36 కోట్ల భారాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలి.

– డాక్టర్ ఈవూరు గణేష్, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, రేపల్లె



విద్యుత్ చార్జీలు పెంపుదలపై ర్యాలీ నిర్వహించిన సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలి

- ఎస్సీ, ఎస్టీల ఉచిత విద్యుత్‌కు మంగళం పాడే కుట్ర
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు
- కూటమి ప్రభుత్వంలో ఇంటింటికీ మద్యం సరఫరా
- పోరుబాటలో వేమూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అశోక్‌బాబు


వేమూరు విద్యుత్ కార్యాలయంలో ఏఈ గోపీకి వినతపత్రం అందజేసిన వరికూటి అశోక్‌బాబు

వేమూరు: ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు పెంపుదలపై శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి పోరు బాట కార్యక్రమం నిర్వహించారు. భట్టిప్రోలు నుంచి వేమూరు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. వేమూరు రైల్వే గేటు సెంటరులో దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. రైల్వే గేటు నుంచి ర్యాలీతో విద్యుత్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అసిస్టెంట్ ఇంజినీరుకు వినత పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చందోలు డేవిడ్ విజయకుమార్, బొల్లిముంత ఏడుకొండలు, కోగంటి లవకుమార్, దాది సుబ్బారావు, విష్ణుమొలకల వెంకటేశ్వరరావు, గాజుల భాను ప్రకాశ్, విష్ణు మొలకల వెంకటరెడ్డియ్య, ఎంపీపీ యల్లమాటి మోహన్, ఎంపీటీసీ అల్లూరు యోన, దున్నా మేరీసు బాబు, గుమ్మడి దానియేలు, మండల పార్టీ అధ్యక్షుడు అనపురెడ్డి రాఘరామరెడ్డి, మాజీ ఎంపీటీసీ దాట్ల మోహన్ రెడ్డి, సర్పంచ్ వుయ్యూరి అప్పి రెడ్డి, శ్రీనివాసరరావు(వాస్) షేక్ హుస్సేన్, అజయ్, పెరికల పద్మారావు, సుజ్జలంక నాగమల్లేశ్వరరావు, కూచిపూడి మోషే, చిలకా మోషే, బిట్ర గుంట సత్యనారాయణ, గాజుల శ్రీనివాసరరావు, భట్టిప్రోలు ఎంపీపీ లలితకుమారి, పడమటి శ్రీనివాసరరావు, శేషాచలం పెద్ద బుజ్జి , సయ్యద్ సిరాజ్‌వుద్దిన్, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తగ్గిస్తామని..పెంచేశారు



సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలను తగ్గిస్తానని చెప్పారు. ఎన్నికల తర్వాత విద్యుత్ చార్జీలు పెంచేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ఎస్సీ, ఎస్టీలకు అందించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగ ద్వారా అరాచకాలను ప్రశ్నించే గొంతులను నొక్కేస్తున్నారు. ఎదిరించిన వారిని అంత మొందించేందుకు వెనుకాడటం లేదు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి పంపించారు. చంద్రబాబు నాయుడు మద్యం సీసాలు ప్రతి ఇంటికి పంపిస్తున్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీ లేకుండా విద్యుత్ చార్జీల పెంపుదల చేశారు. ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలి. – వరికూటి అశోక్‌బాబు, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, వేమూరు

క్లుప్తంగా

నేడు భట్టిప్రోలులో రెవెన్యూ సదస్సు

భట్టిప్రోలు: భట్టిప్రోలులో శనివారం రెవెన్యూ సదస్సు జరుగుతుందని శుక్రవారం తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు తెలిపారు. దీర్ఘకాలికంగా, అపరిష్కృతంగా సమస్యలను ఫిబ్రవరి 22వ తేదీ నాటికి పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

ఘనంగా సీపీఐ శత జయంతి వేడుకలు



రేపల్లెరూరల్: దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని వీరోచిత పోరాటాలను నిర్వహించిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదేనని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పి.నాగాంజనేయులు అన్నారు. సీపీఐ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం రేపల్లె సీపీఐ కార్యాలయం వద్ద సీపీఐ శాఖ కార్యదర్శి చొక్కాకుల శివశంకర్ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. నాగాంజనేయులు మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీ భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పిలుపునిచ్చిందన్నారు. సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, ఏఐటీయూసీ నాయకులు ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం రూ.2 లక్షల డిపాజిట్



కొల్లూరు : విద్యార్థులను ప్రోత్సహించేందుకు పాఠశాల పూర్వ విద్యార్థి క్రాప వీరబ్రహ్మాచారి రూ. 2 లక్షలు నగదు శుక్రవారం డిపాజిట్ చేశారు. కొల్లూరు బాలుర, బాలికోన్నత పాఠశాలల హెచ్ఎంలకు డిపాజిట్ బాండ్లు అందజేశారు. ప్రతి ఏడాది డిపాజిట్‌పై వచ్చిన వడ్డీని నగదు ప్రోత్సాహకంగా అందజేయాలని సూచించారు. హెచ్ఎంలు కె.నాగపాప, ఉషారాణి పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి నివాళి


మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

రేపల్లెరూరల్: మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మృతి పట్ల శుక్రవారం నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి మున్సిపల్ అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. దేశానికి ఆయన సేవలను పలువురు కొనియాడారు. నివాళులర్పించిన వారిలో శానిటరీ ఇనిస్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ శ్రీలక్ష్మి, ఆర్‌వో రత్నాంజలి, ఏఈ రోహిణి, సిబ్బంది రోశయ్య, బుల్లయ్య, ఖాదర్ వలి తదితరులున్నారు. పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి సీవీ మోహనరావు, పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ యడ్లపల్లి కిషోర్‌బాబు, రసాలయ కళా సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కోడె గౌరీశంకర్, వివిధ ప్రజాసంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

విద్యార్థులకు క్రిస్మస్ కానుకలు


క్రిష్మస్ కానుకలతో సండే స్కూల్ విద్యార్థులు

భట్టిప్రోలు: అద్దేపల్లిలోని లూథరన్ చర్చిలో క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన వంద మంది సండే స్కూల్ విద్యార్థులకు రెవరెండ్ మద్దిరాల ఆనందరావు క్రిస్మస్ కానుకలను శుక్రవారం అందచేశారు. కోలాటం, నాటికల ప్రదర్శన, క్రీస్తు పాఠలకు నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వరిగడ్డి వామి దగ్ధం

కోమలి(కర్లపాలెం): మూడు ఎకరాల వరిగడ్డి వామి దగ్ధమైన ఘటన పిట్టలవానిపాలెం మండలంలోని కోమలి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కంచర్ల శివప్రసాద్ వివరాల మేరకు.. తమ పశువుల కోసం రూ.50 వేలతో మూడు ఎకరాల వరిగడ్డి కొనుగోలు చేసి, వామి వేసి ఉంచామని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో గడ్డి వామి దగ్ధమైందని చెప్పారు. పొన్నూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారని శివప్రసాద్ తెలిపారు.

రేపు లచ్చన్న విగ్రహాల శుద్ధికి పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న కేసన శంరరావు

బాపట్ల: రాజకీయాలకు అతీతంగా, సమాజంలోని అన్ని వర్గాల, తరగతుల వారు గౌతు లచ్చన్నకు 29న నివాళులు అర్పించాలని బీసీ నాయకులు కేసన శంకరరావు పిలుపునిచ్చారు. బాపట్లలోని బీసీ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూజివీడులో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ సందర్భంగా చోటు చేసుకున్న ఘటనలు– తదనంతర పరిణామాలకు ప్రతిస్పందనగా, బీసీల ఐక్యతే లక్ష్యంగా పని చేస్తామన్నారు. పవిత్ర నదీ జలాలు, పాలాభిషేకం చేసి శుద్ధి చేయాలని పిలుపు నిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య, జిల్లా కార్యదర్శులు ఎస్ఎస్‌పీ రాజు, మారం రవికుమార్ పాల్గొన్నారు.

అనాథలకు ఉపాధి కల్పన

తెనాలిరూరల్: నిరాశ్రయులైనా.. పరాశ్రయులు కాలేదు. స్వశక్తిని నమ్ముకుని తమ సృజనకు పదును పెట్టి.. వివిధ వస్తువులు, హ్యాండ్ బ్యాగులు తయారు చేస్తున్న అనాథల కళను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ గుర్తించారు. అలాగే ఎమ్మార్పీఎస్ నాయకుడు కిన్నెర నాగరాజు ఇటీవల అంగలకుదురులోని జేఎంజే స్వధార్ హోమ్‌లో అనాథలు, వితంతువులకు ప్రభుత్వ పరంగా సాయం అందేలా చూడాలని గ్రీవెన్స్‌లో కోరారు. మరునాడు స్వధార్ హోమ్‌ను తహసీల్దార్ పరిశీలించారు. అక్కడ ఉంటున్న వారిలో కొందరు బొమ్మలు, బ్యాగులు తయారు చేస్తున్నారని గుర్తించారు. వీరి సృజననే పెట్టుబడిగా పెట్టించి వీరికి జీవనోపాధి కల్పించాలని ఆలోచన చేశారు. ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్‌తో మాట్లాడారు. తహసీల్దార్ స్వయంగా అంగడి తయారు చేయించారు. బస్టాండ్ వద్ద పెట్టించి, ట్రైనీ ఐఏఎస్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ శుక్రవారం ప్రారంభించారు. అనాథలు తయారు చేసిన వస్తువులను ఇక్కడ విక్రయిస్తారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి

భట్టిప్రోలు: గ్రామాల్లో రైతులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులు ఎంతగానో దోహదపడతాయని రేపల్లె ఆర్డీవో ఎన్.రామలక్ష్మి అన్నారు. శుక్రవారం భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి, మండలంలోని ఐలవరం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా ఆర్డీవో పాల్గొని, మాట్లాడారు. భూ క్రయ, విక్రయాలు ఒకరి పేరు మీద ఒకరు మార్పించేందుకు భూ రిజిస్ట్రేషన్లు ఉంటే సమస్యలను దరఖాస్తు రూపంలో తెలియ చేసుకోవచ్చన్నారు. అద్దేపల్లిలో 26, ఐలవరంలో 10 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, సర్పంచులు దారా రవి కిరణ్మయి, మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీటీసీ మురుగుడు శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఎం.కోటేశ్వరరావు, దేవాదాయ శాఖ మండల ఇన్‌చార్జ్ దీవి వేంకటప్లాచార్యులు, ఆర్ఐ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోరుబాటకు భారీగా తరలిన పార్టీ శ్రేణులు

భట్టిపోలు: కరెంట్ చార్జీల బాదుడుపై వేమూరులో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమానికి మండలం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. స్థానిక రైల్వే గేట్ వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చింతమెటు సర్పంచ్ గుమ్మడి శంకరరావు, సూరేపల్లి ఉప సర్పంచ్ జంగం వాసు, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నాయకులు సిరాజుద్దీన్, దావూరి నాగమల్లేశ్వరరావు, నబీ, కొనకాల శ్రీనివాసరావు, మద్దుల గిరిధర్, అబ్దుల్లాబేగ్, వేల్పూరి నాగేశ్వరరావు, బేతాళ వర కుమార్, నీలా శ్రీనివాసరావు, పులివర్తి వరప్రసాద్, కారుమంచి కిషోర్ , మోర్ల కోటేశ్వరరావు, వాకా అంకబాబు, గోలి శ్రీనివాసరావు,కుక్కల వెంకట్రామయ్య, బొల్లెద్దు ప్రతాప్, వేల్పూరి బాలసుబ్రహ్మణ్యం, గుజ్జర్లమూడి రాజు, వాకా అంకబాబు పాల్గొన్నారు.

రేపు పెన్షనర్స్ డే వేడుకలు

రేపల్లెరూరల్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ సంఘం రేపల్లె శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు పెన్షనర్స్ డే వేడుకలు నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు జె.సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూలులో నిర్వహించే కార్యక్రమంలో పలువురు పెన్షనర్‌లను సన్మానించటం జరుగుతుందన్నారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, పలువురు ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. పెన్షనర్‌లు సమావేశంకు హాజరు కావాలని కోరారు.

కోస్టల్ బ్యాంక్ దినదినాభివృద్ధి

కొల్లూరు : ఖాతాదారులకు నిస్వార్థ సేవలను అందజేయడం కోస్టల్ బ్యాంక్ దినదినాభివృద్ధి చెందుతోందని కొల్లూరు శాఖ మేనేజర్ టి.మోహన్ మణిధర్ అన్నారు. శుక్రవారం బ్యాంక్ 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను శాఖలో నిర్వహించారు. సుస్థిరమైన బ్యాంక్‌గా ఎదగడం వెనుక ఖాతాదారులకు అందించిన నమ్మకమైన సేవలే మూలకారణమన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

భట్టిప్రోలు: స్థానిక రైలు పేట పరిశుద్ధ మార్కు లూథరన్ దేవాలయం నూతన సంవత్సర క్యాలెండర్‌ను సర్పంచ్ దారా రవి కిరణ్మయి శుక్రవారం ఆవిష్కరించారు. రెవరెండ్ దాసరి రవీంద్ర వర్మ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు కోంద్రు జగదీష్, కొమరాబత్తుని వసంతరావు, మధుసూధనరావు, దారా చెన్నయ్య పాల్గొన్నారు.

రక్తదానం చేయాలి

కర్లపాలెం: రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ కె.మానస అన్నారు. శుక్రవారం బ్యాంక్ ఆవరణలో రక్తదాన శిబిరం కర పత్రాలను ఆమె ఆవిష్కరించారు. ఈ నెల 31న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 7గంటల వరకు రక్తదాన శిబిరం జరుగుతుందని తెలిపారు. మండల చైర్మన్ ఇనకొల్లు పోలీస్‌రావు మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు.